

అరసవల్లిలో కొందరి పెత్తనం..

అరసవల్లి శ్రీసూర్యభగవానుడి ఆలయంలో ఇద్దరు వ్యక్తుల మధ్య పెత్తన పోరు నడుస్తోంది. ఇరవై నెలలుగా జీతాలు అందని వ్యక్తిని తెచ్చి ఆదిత్యుని ఆలయానికి కీలక అధికారిగా నియమించారు. వేతనం అందకపోవడానికి గల కారణాలు కీలకంగానే ఉన్నా.. ఓ రిటైర్డ్ ఉద్యోగి, నకిలీ ఆర్డరుతో ఏళ్లతరబడి ఉద్యోగం చేసి కొన్నాళ్ల కిందట తొలగించిన మరో వ్యక్తికి ఆలయంలో పెత్తనం అందించారు. ఈ ఇద్దరు వ్యక్తుల పెత్తనంతో అటు అర్చకులు కూడా నోరు మెదపలేక.. ఇంటిగుట్టు బయటపెట్టలేక ఇబ్బందులు పడుతున్నారు. ఆదిత్యుని ఆలయాన్ని వైసీపీ ఐదేళ్ల పాలనలో ఇసుమంతైనా అభివృద్ధి చేయలేదు. దాతల సహకారంతో మాత్రమే అభివృద్ధి పనులు చేపట్టారు. ఆదిత్యుని ఆలయ అభివృద్ధిపై ప్రజా ప్రతినిధులు ప్రత్యేక చర్యలు తీసు కోవాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.



ప్రక్షాళన.. ఇంకెప్పుడు?

- కలెక్టర్, కార్పొరేషన్ కమిషనర్, వంశధార ఎస్ఈ మాత్రమే బదిలీ
- వైసీపీతో అంటకాగిన అధికారులపై చర్యలు శూన్యం
- అక్రమార్కులపై ప్రభుత్వం దృష్టి సారించాలని జిల్లావాసుల విజ్ఞప్తి



వంశధార నదిలో ఇసుక అక్రమ తవ్వకాలు

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

ఎన్డీయే కూటమి ప్రభుత్వం కొలువుదీరి నెల రోజులకుపైగా దాటింది. గత ప్రభుత్వంలో అక్రమాలకు పాల్పడిన ప్రభుత్వ శాఖల ప్రక్షాళనపై కొత్త ప్రభుత్వం దృష్టి సారిస్తుందని జిల్లా వాసులు భావించారు. కాగా.. ఈ నెల రోజుల్లో కేవలం వంశధార ఎస్ఈ, ఆ తర్వాత శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్, తర్వాత కలెక్టర్‌ను మాత్రమే బదిలీ చేసింది. ఇంకా ప్రక్షాళన చేయాల్సిన ఇతర ప్రభుత్వ శాఖల జోలికి వెళ్లలేదు. గతంలో వైసీపీ నాయకులతో అంటకాగి.. వారి అక్రమాలకు సహకరించిన అధికారులపై కనీసం బదిలీ చర్యలు కూడా తీసుకోకపోవడంపై జిల్లావాసులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇలా అయితే పాలన ఎలా గాడిన పడుతుందని ప్రశ్నిస్తున్నారు. అక్రమార్కుల ప్రక్షాళనకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

● ఆ శాఖలు అంతే..

ప్రజలకు సరిగ్గా తెలియని శాఖల్లో 'సమగ్ర శిక్ష' ఒకటి. గత ఐదేళ్లలో ఇష్టానుసారంగా సిఫార్సులతో నియామకాలు.. పాతవారని తొలగింపు.. ఆపై అక్రమాలు యథేచ్ఛగా సాగాయి. అక్రమాలు బయటపడకుండా కీలక అధికారి.. అప్పటి వైసీపీ ప్రభుత్వంలో కీలక ప్రజాప్రతినిధులను ప్రసన్నం చేసుకున్నారు. ఇప్పటి కొత్త ప్రభుత్వంలోనూ తన పోస్టు పదిలం చేసుకునేందుకు.. కీలక ప్రజాప్రతినిధుల మెప్పు కోసం విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. అక్రమాలు కోకొల్లలుగా జరిగినా.. ఇక్కడ విచారణ చేపట్టి చర్యలు తీసుకున్న సంఘటనలు ఇంతవరకు లేదు. ఎన్డీయే కూటమి ప్రభుత్వమైనా 'సమగ్ర శిక్ష'ను ప్రక్షాళన చేసి.. అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని జిల్లావాసులు డిమాండ్ చేస్తున్నారు. ఇక జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో ఇప్పటికీ డిప్యూటేషన్లపై వచ్చిన ఉద్యోగులు అధికమంది ఉన్నారు. ఓవైపు డిప్యూటేషన్లను రద్దుచేయాలని ప్రభుత్వ కీలక అధికారులు ఆదేశాలు జారీచేసినా.. సిఫార్సుల లేఖతో ఇంకా కొనసాగుతున్నారు. ఇటు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఉండే కీలక అధికారులు ఇన్‌చార్జిల హోదాలో ఉన్నారు. ఆసుపత్రికి వచ్చే వైద్యులపై పర్యవేక్షణ తప్పింది. ఇక్కడ నిఘా పెంచి పటిష్టం చేయాల్సిన బాధ్యత జిల్లా అధికార యంత్రాంగానిదే.

● పోలీసుశాఖకు ఇంకెంత సమయం?

పోలీసు శాఖలో ఎన్నికల ముందు బదిలీల్లో వచ్చినవారు ఇప్పటికీ తమ స్థానాలను పదిలం చేసుకునేందుకు అన్నిరకాల ప్రయత్నాలు చేస్తున్నారు. ఒకటీ రెండు చోట్లా ఆ ప్రయత్నాలు కూడా ఫలించాయి. జిల్లాలోని ఓ సామాజికవర్గానికి చెందిన వారే అయినప్పటికీ.. పదోతరగతి విశాఖలో పూర్తిచేసినవారు కావడంతో.. వారు సిక్కోలులో పలుచోట్ల విధులు నిర్వహిస్తున్నారు. ఇటువంటివారు ఇప్పుడు బంధుత్వాలు కలుపుకుని ఫలానా సర్కిల్‌కు సీఐగా ఉంటామని.. అభయం ఇవ్వాలని.. ఫలానా స్టేషన్‌కు ఎస్ఐగా ఉంటామని.. తననే సిఫార్సు చేయాలని ఎమ్మెల్యేలను కోరుతున్నారు. వైసీపీ పాలనలో అన్ని నియోజకవర్గాల్లోనూ టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదయ్యాయి. పలాసలో అక్కడ టీడీపీ నాయకురాలు, ప్రస్తుత ఎమ్మెల్యే గౌతు శిరీషను, కార్యకర్తలను పోలీసులు వేధించారు. కొన్నాళ్ల క్రితం ఓ సీఐ అయితే వైసీపీకి ప్రధాన అనుచరుడిగానే ఉండేందుకు ఇష్టమన్నట్లుగా వ్యవహరించి.. అక్రమ కేసుల బనాయింపులో ముందువరుసలో నిలిచారు. ఇక ఇద్దరు డీఎస్పీలు సైతం.. అప్పట్లో టీడీపీ శ్రేణులు ఇచ్చే ఫిర్యాదులను సైతం పట్టించుకునేవారుకాదు. ఇటువంటివారిపై ఇంతవరకు చర్యలు లేవు. కొంతమంది బదిలీపై వెళ్లిపోయినా.. వారు చేసిన ఉల్లంఘనలపై చర్యలు తీసుకుంటేనే ప్రజలకు వాస్తవాలు తెలుస్తాయి.

● అన్నింటా అక్రమాలే..

వైసీపీ పాలనలో ఇసుక, మద్యం, గ్రానైట్ ఇలా అన్నింటా అక్రమాలు భారీగా సాగాయి. ఐదేళ్లలో వంశధార, నాగావళి నదుల నుంచి ఇసుక భారీగా తరలిపోయింది. వైసీపీకి చెందిన ప్రజాప్రతినిధులే దోచుకుతిన్నారు. సామాన్యులకు ఇసుక అందుబాటులోకి రాకుండా చేసేశారు. మైనింగ్ అధికారులు తమకు సంబంధం లేనట్టుగా ఉండిపోయారు. ఇక టెక్కలి ఏరియాలో ఒకపేరుతో కొన్ని గ్రానైట్ క్వారీలలో తవ్వకాలు జరిగినా చర్యలు శూన్యం. ఆ అధికారులే ఇప్పుడూ ఉన్నారు. వీరిపైనా చర్యలు లేవు. ఇక గత ఐదేళ్లలో విచ్చలవిడిగా బెల్ట్ దుకాణాలు అంతటా వెలిసాయి. సెబ్ అధికారులు మొక్కుబడిగా వ్యవహరించి.. "నాటుసారా తయారీచేసేవారిపైనే కఠినచర్యలు తీసుకుంటాం... బెల్టు దుకాణాల పనిపట్టడమన్నది మాకు సంబంధంలేదు" అనే రీతిలోనే వ్యవహరించారు. ఇష్టానుసారంగా కిందిస్థాయి సిబ్బందిని నియమించుకుని అత్యంతగా అక్రమాలకు తెరతీశారు. ఈ శాఖపైనా చర్యలు లేవు. ఇప్పటికైనా ఇటువంటి కీలక శాఖలపై ప్రభుత్వ ప్రతినిధులు దృష్టిసారించి ప్రక్షాళన చేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.





వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్న బాధ్యతల స్వీకరణ

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శుక్రవారం విజయవాడలోని తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు ప్రత్యేకంగా వెళ్లి కలిసి ఆయనను అభినందించారు. శ్రీకాకుళం, నరసన్నపేట, ఎచ్చెర్ల, పాతపట్నం ఎమ్మెల్యేలు గొండు శంకర్, బగ్గు రమణమూర్తి, నడుకుదిటి ఈశ్వరరావు, మామిడి గోవిందరావు, జిల్లా టీడీపీ అధ్యక్షుడు కలమట వెంకటరమణ, కళింగ వైశ్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోయిన గోవిందరాజు, టీడీపీ నగర అధ్యక్షుడు మాదారపు వెంకటేష్ తదితరులు మంత్రి అచ్చెన్నకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఎత్తిపోతల పథకాలకు నిధులు మంజూరు చేయించినందుకు అభినందించారు.

- శ్రీకాకుళం, ఆంధ్రజ్యోతి

ఇది కాలువే..

గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో పంట కాలువలు అధ్వానంగా మారాయి. ఐదేళ్లలో వంశధార ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల నిర్వహణను గాలికొదిలేయడంతో సాగు నీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెలరోజుల్లోనే కాల్వల నిర్వహణకు నిధులు కేటాయించింది. వంశధార ఎడమ కాలువ పరిధిలో నీరు విడిచిపెట్టే ముందు అభివృద్ధి పనులు చేపడుతోంది. కాగా.. కాలు వల్లో పూడికలు, గుర్రపుడెక్క పేరుకుపోవడంతో.. శివారు భూములకు సాగునీరు అందించేందుకు ఇబ్బందులు ఏర్పడనున్నాయి. హిరమండలం మండలం మహాలక్ష్మీపురం వద్ద వంశధార ఎడమ కాలువ గుర్రపుడెక్కతో దర్శనమిస్తోంది. సాగునీరు సక్రమంగా అందడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

- హిరమండలం





ఖాదీ చీరను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ సునీత

సమస్యలు పరిష్కరిస్తాం

- చేనేత జౌళిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.సునీత
- ఏఎఫ్‌కేకే సంఘానికి రూ.లక్ష విరాళం

పొందూరు, జూలై 12: ప్రపంచ ప్రఖ్యాత ఖాదీ రంగంలో వడుకు, నేత కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి.. పరిష్కరిస్తామని రాష్ట్ర చేనేత జౌళ్ల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.సునీత హామీ ఇచ్చారు. వడుకు కార్మికులకు 50ఏళ్లకే పింఛన్ పథకం వర్తింపజేసేలా కృషి చేస్తామన్నారు. శుక్రవారం పొందూరులోని ఏఎఫ్‌కేకే సంఘం సముదాయాన్ని ఆమె సందర్శించారు. మహిళా కార్మికులతో ఏర్పాటుచేసిన వడుకు ప్రక్రియను పరిశీలించారు. అనంతరం కార్మికులు, చేనేత నాయకులతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు. 'ఏఎఫ్‌కేకే సంఘం ఆధ్వర్యంలో 800 మంది వడుకు, 50 నేత కార్మిక కుటుంబాలు పని చేస్తున్నాయి. ప్రభుత్వ ప్రోత్సాహం లేక నేత, వడుకు పనిపై యువత ఆసక్తి చూపడం లేదు. ఇలానే కొనసాగితే ఖాదీ రంగం అంతరించిపోతుంద'ని ఏఎఫ్‌కేకే సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గుంటుకు కామేశ్వర ప్రసాద్, దండా వెంకటరమణ తెలిపారు. అలాగే అంపోలు చేనేత సొసైటీ ప్రతినిధి కాశిన ప్రసాద్.. చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. చేనేత సొసైటీలకు ఆప్కో నుంచి రావాల్సిన బకాయిలు ఇప్పించాలని కోరారు. దీనిపై ప్రిన్సిపల్ సెక్రటరీ సునీత స్పందిస్తూ.. ఖాదీరంగం అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. చేనేత ఉత్పత్తులకు డిమాండ్ పెరగాలంటే ప్రత్యేక డిజైన్లు రూపొందించాలని జౌళ్లశాఖ డిజైనర్లను ఆదేశించారు.

● పొందూరు మండలంలో ఏడాదిన్నరగా 3 చేనేత క్లస్టర్లు పనిచేస్తున్నా.. లబ్ధిదారులకు పరికరాలు, ప్రయోజనాలు అందడం లేదని పలువురు ఫిర్యాదు చేశారు. పరికరాలు పంపించడంలో సరఫరాదారులు జాప్యం చేస్తున్నారని జౌళ్ల శాఖ జిల్లా ఏడీ చెప్పడంతో ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. డిఫాల్టర్లను తొలగించి తక్షణమే క్లస్టరు లబ్ధిదారులకు పరికరాలు, ప్రయోజనాలు అందేలా చూడాలని ఆదేశించారు. కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తున్న ఏఎఫ్‌కేకే సంఘానికి ఆమె వ్యక్తిగతంగా రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. కార్యక్రమంలో చేనేత జౌళ్ల శాఖ అడిషనల్ డైరెక్టర్ కె.శ్రీకాంత్ ప్రభాకర్, ఏడీ సీహెచ్ సాయిప్రసాద్ పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణలు తొలగించరా?

- కలెక్టర్, జేసీ ఆదేశాలు బేఖాతరు
- మారని అధికారుల తీరు
- ఆక్రమణదారులు వైసీపీ వర్గీయులు కావడంతో తాత్సారం
- వీఆర్వో, ఆర్ఐపై వెల్లువెత్తుతున్న ఆరోపణలు

(శ్రీకాకుళం రూరల్)

రాష్ట్రంలో ప్రభుత్వం మారినా.. అధికారుల తీరులో మాత్రం మార్పు రాలేదు. వైసీపీ పాలనలో ఖాళీ స్థలం కనపడితే చాలు.. ఆక్రమణకు పాల్పడేవారు. కొండలు, చెరువు గర్భ భూములను సైతం దర్జాగా కబ్జా చేసేశారు. శ్రీకాకుళం మండలం తండ్యేంవలసలోని సర్వే నెంబర్ 94లో ఉన్న చెరువు గర్భ భూమిని ఏడాది కిందట ఆ గ్రామ పెద్దన్న సాక్షిగా కొందరు ఆక్రమణకు పాల్పడ్డారు. దీనిపై గతేడాది మార్చిలో 'స్పందన'లో అప్పటి కలెక్టర్ శ్రీకేష్ బాలాజీ లఠ్కర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ చేపట్టాలని రెవెన్యూ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. విచారణ చేపట్టిన రెవెన్యూ అధికారులు.. ఆక్రమణ నిజమేనని నివేదిక అందజేశారు. దీంతో ఆక్రమణలు తొలగించాలని నాటి తహసీల్దార్ వెంకటరావుకు కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు. కాగా.. తెరవెనుక అధికార పార్టీ నేతలు ఉండడంతో ఆక్రమణల తొలగింపునకు వెనకడుగు వేశారు.

ఆగని పోరాటం

తండ్యేంవలస చెరువు గర్భ భూ ఆక్రమణలు తొలగించాలంటూ గ్రామస్థులు అలుపెరగని పోరాటం చేస్తున్నారు. తొలుత సచివాలయంలో ఫిర్యాదు చేయగా అధికారులు పట్టించుకోలేదు. దీంతో గత కలెక్టర్ శ్రీకేష్‌బాలాజీ లఠ్కర్‌ను ఆశ్రయించగా.. ఆక్రమణలు తొలగించాలని ఆదేశించారు. ఈ మేరకు ఆక్రమిత స్థలంలో రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. కానీ, నాటి వైసీపీ నేతల ప్రోత్సాహంతో ఏడాదిపాటు ఆక్రమణల తొలగింపులో తాత్సారం చేశారు. అయినా గ్రామస్థులు చెరువును కాపాడుకునేందుకు పోరాటాన్ని వీడలేదు. న్యాయం కోసం పత్రికలను ఆశ్రయించారు. ఈ క్రమంలో ఈ ఏడాది మే 24న 'ఆంధ్రజ్యోతి'లో "మరో చెరువు" ఆక్రమణ పేరిట వరుస కథనాలు ప్రచురితమవడంతో జిల్లా అధికారులు స్పందించారు. తక్షణమే ఆక్రమణలు తొలగించాలని జేసీ నవీన్.. తహసీల్దార్‌కు ఆదేశాలు జారీచేశారు. ఎన్నికల నేపథ్యంలో తహసీల్దార్ వెంకటరావుకు బదిలీ కాగా.. ఆయన స్థానంలో వచ్చిన బీవీ రాణికి ఆక్రమణల తొలగింపు బాధ్యత అప్పగించారు. ఈ మేరకు పోలీసు బందోబస్తు కల్పించాలని తహసీల్దార్ రాణి.. పెద్దపాడు పోలీసులకు లేఖ రాశారు. ఎన్నికల కారణంగా బందోబస్తు సమకూర్చలేమని, శాంతిభద్రతల లోపం వాటిల్లుతుందని పోలీసులు చెప్పడంతో ఆక్రమణల తొలగింపు పనులు నిలిచిపోయాయి. ఎన్నికల అనంతరం.. ఎన్డీయే కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో తండ్యేంవలస గ్రామస్థులు తమకు న్యాయం చేయాలంటూ ఈ నెల 8న మరోసారి 'మీ కోసం' వేదికగా కలెక్టర్‌ను ఆశ్రయించారు. కొత్త కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు తమ చెరువు సమస్యను వివరించారు. ఆక్రమణలు తొలగించేలా చర్యలు చేపట్టాలని తహసీల్దార్ రాణికి కూడా వినతిపత్రాన్ని అందజేశారు.



చెరువు ఆక్రమిత స్థలంలో అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు(ఫైల్)

జీవో పేరుతో తాత్సారం

తండ్యేంవలసలో సర్వే నెంబర్ 94లో స్థలాన్ని ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టినవారికి.. సచివా లయ సిబ్బంది నోటీసులు ఇచ్చి చేతులు దులిపేసు కున్నారు. చెరువు ఆక్రమణల వెనుక గ్రామ వైసీపీ పెద్ద హస్తం ఉండటంతో వీఆర్వో, ఆర్ఐ ఆక్రమణదారులకు వత్తాసు పలికారు. ఏడాదిపాటు తహసీల్దార్ దృష్టికి ఆక్రమణ విషయాన్ని తీసుకువెళ్లలేదు. 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో వీరిద్దరికి తహసీల్దార్ రాణి నోటీసులు ఇచ్చారు. విచారణ రిపోర్టు ఇవ్వాలని ఆదేశించారు. ఆక్రమణ వాస్తవమేనని వారు నివేదిక ఇచ్చారు. అయితే ఆక్రమణ తొలగింపు నిలుపుదలకు నేడు అధికారులు మరో కొత్త కారణం కనుక్కున్నారు. ఇటీవల ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు ఆధారంగా పంచాయతీ పరిధిలో చెరువు ఆక్రమణల తొలగింపు.. ఎంపీడీవో ఆధ్వర్యంలో జరగాలని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. కాగా.. గురువారం ఆక్రమణలు తొలగించాలని తండ్యేంవలస గ్రామస్థులు తహసీల్దార్ రాణికి వినతిపత్రం అందజేశారు. అయితే ఇది పంచాయతీ పరిధిలోకి వస్తుందని.. ఎంపీడీవోను కలవాలని ఆమె చెప్పడంతో కథ మళ్లీ మొదటికి వచ్చింది. ఈ మేరకు గ్రామస్థులు ఎంపీడీవోను కలవగా.. తహసీల్దార్‌తో చర్చించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న తండ్యేంవలస గ్రామస్థులు (ఫైల్)

నిర్ణయం తీసుకుంటాం

తండ్యేంవలసలో సర్వే నెంబర్ 94లో చెరువు గర్భ భూములు ఆక్రమణ వాస్తవం. ఈ విషయం తెలియజేయనందుకు క్రమశిక్షణా చర్యల్లో భాగంగా వీఆర్వో, ఆర్ఐకు, భూఆక్రమణకు పాల్పడిన బెండి నిర్మల, సాధు చిన్నారావు, సాధు మల్లేసుకు నోటీసులు ఇచ్చాం. గతంలో చెరువు ఆక్రమణలు తొలగించేందుకు జేసీ నవీన్ ఆదేశించగా, పోలీసు బందోబస్తు అడిగాం. ఎన్నికల వల్ల కుదరకపోవడంతో తొలగింపు పనులు నిలిచిపోయాయి. ఆక్రమణలు తొలగింపుపై సోమవారం ఎంపీడీవో, ఈవో పీఆర్డీతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం.

-బీవీ రాణి, తహసీల్దార్, శ్రీకాకుళం

మా అల్లుడని డబ్బులిచ్చి ఆదుకున్నాం


లావణ్య తల్లితండ్రులు


ప్రస్తుతం టాలీవుడ్‌లో నటుడు రాజ్‌తరుణ్, లావణ్య వ్యవహారం ఓ హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పటివరకూ లావణ్య మాత్రమే మీడియాతో మాట్లాడారు. ఇప్పుడు ఆమె తల్లితండ్రులు కూడా మీడియా ముందుకు వచ్చి ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో ప్రత్యేకంగా మాట్లాడారు. చెప్పుకోలేని సంఘటనలు జరిగాయని కన్నీళ్లు పెట్టుకున్నారు. కరోనా సమయంలో రాజ్‌తరుణ్‌కి ఎవరూ సాయం చేయకపోయినా అతన్ని అల్లుడిగా భావించి డబ్బు సాయం చేసి ఆదుకున్నట్లు వారు చెప్పారు. 'మా అమ్మాయికి రాజ్‌తరుణ్ అన్యాయం చేశాడు. అతను ఎక్కడున్నా తీసుకువచ్చి వాళ్లిద్దరినీ కలిపేవరకూ వెనుకంజ వేయం' అని లావణ్య తండ్రి స్పష్టం చేశారు. లావణ్యకు డ్రగ్స్ తీసుకునే అలవాటు లేదనీ, అక్రమ సంబంధాలు ఉన్నాయనడం కట్టుకథ అనీ, ఓ ఆడపిల్ల మీద ఇలా నిందలు వేయడం తగదనీ ఆయన అన్నారు. తనకు బెదిరింపు కాల్స్ వస్తున్నాయనీ, 'డ్రగ్స్ కేసులో నువ్వు బెయిల్ మీద బయటకు వచ్చావనీ, ఇలాంటి న్యూసెన్స్ చేస్తే బెయిల్ రద్దయి, ఇక జైలు నుంచి తిరిగి రాలేవని రాజ్‌తరుణ్, హీరోయిన్ మాల్వి బెదిరించారని లావణ్య చెప్పారు. రూ. ఐదు కోట్లు ఇచ్చి సెటిల్‌మెంట్ చేసుకుంటామని, కేసు వెనక్కి తీసుకోమని కూడా చెబుతున్నారని ఆమె వెల్లడించారు. 'నేను డ్రగ్స్ తీసుకుని ఉంటే రాజ్‌తరుణ్ కూడా తీసుకున్నట్లే. నేను వాటిని అమ్మితే .. అమ్మించింది అతనే. ఇందులో నిజం ఏమిటో పోలీసులే తేల్చాలి' అన్నారు లావణ్య. 'ఈ పోరాటం ఆపను. రాజ్ ఎక్కడ ఉంటే అక్కడికి వెళతాను. 14 ఏళ్ల పరిచయం, పదేళ్ల సహజీవనం ఎలా కాదంటాడో నేనూ చూస్తా' అని స్పష్టం చేశారు లావణ్య.

ప్రేమకథలు జీవితకాలం వెంటాడుతాయి



సంతోష్ శోభన్, సోషల్ మీడియాలో పాపులర్ అయిన అలేఖ్య హారిక జంటగా ఓ చిత్రం రూపుదిద్దుకుంటోంది. ఎస్.కె.ఎన్., దర్శకుడు సాయిరాజేశ్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రమిది. సుమన్ పాతూరి దర్శకుడు. హీరో సంతోష్ శోభన్ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ కొత్త పోస్టర్ విడుదల చేశారు. ఇందులో ఉన్న 'ప్రేమకథలు జీవితకాలం వెంటాడుతాయి' అనే క్యాప్షన్ అందరినీ ఆకట్టుకుంటోంది. ఆగస్టు నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమయ్యే ఈ చిత్రం మ్యూజిక్ సిట్టింగ్స్ సంగీత దర్శకుడు విజయ్ బుల్గానిన్ సారథ్యంలో ప్రస్తుతం జరుగుతున్నాయి.

అక్షయ్‌కుమార్‌కు కరోనా



చిత్ర ప్రముఖుల్ని కరోనా రక్కసి ఇంకా వదిలి పెట్టలేదు. తాజాగా బాలీవుడ్ నటుడు అక్షయ్‌కుమార్ ఈ రక్కసి చేతికి చిక్కారు. ప్రపంచ కుబేరుడు ముఖేశ్ అంబానీ కుమారుడు అనంత్ వివాహానికి వెళ్లడం కోసం శుక్రవారం కొవిడ్ టెస్ట్ చేయించుకున్నారు. పాజిటివ్ రావడంతో పెళ్లికి వెళ్లడం మానుకుని ఇంటి గదికి పరిమితం అయ్యారు. తమిళంలో హిట్ అయిన సురారై పోట్రు' చిత్రం ఆధారంగా రూపొందిన 'సర్ఫిరా' చిత్రం శుక్రవారం విడుదల అయింది. ఈ సినిమా ప్రమోషన్స్ కోసం ఇటీవల చాలా చోట్లకు వెళ్లారు అక్షయ్. అప్పుడే ఆయనకు వైరస్ సోకి ఉంటుందని అంటున్నారు.

నా ఫ్లాపుల్ని ఎంజాయ్ చేస్తున్నారు

'సర్ఫిరా' ప్రమోషన్స్‌లో భాగంగా అక్షయ్ ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో 'నా ఫ్లాపుల్ని చూసి కొంతమంది ఎంజాయ్ చేస్తున్నారు. పరిశ్రమలో ఇలాంటి రాజకీయాలు బాధ కలిగిస్తున్నాయి' అని ఆవేదనతో చెప్పారు. ఏడాదికి నాలుగు సినిమాలు చేస్తూ, ఓవర్ ఎక్స్‌పోజ్ అవుతున్నాడంటూ వచ్చిన కామెంట్స్ ను ఆయన కొట్టి పడేశారు. 'నేను రెండేళ్లకు ఒక్క సినిమానే చేస్తా. అది హిట్ అవుతుందని ఎవరైనా గ్యారంటీ ఇవ్వగలరా?' అని అక్షయ్ ప్రశ్నించారు. 'వర్క్ చేస్తూనే ఉండాలి. నీ దగ్గరకు వచ్చిన అవకాశాల్ని పోగొట్టుకోకు. ఎవరి మాటా వినకు. నీ నటన ప్రేక్షకులకు నచ్చితే వాళ్లే నిన్ను నెత్తిన పెట్టుకుంటారు' అని అమితాబ్ చెప్పిన మాట పాటిస్తున్నా' అని చెప్పారు అక్షయ్.

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/bmGd9pLలో చదవండి.

విజిలేస్కో...



తమిళ హీరో విజయ్ కథానాయకుడిగా వెంకట్ ప్రభు దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ది గోట్' (గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్). శుక్రవారం చిత్ర బృందం తొలి పాటను విడుదల చేసింది. 'విజిలేస్కో' అంటూ సాగే ఈ మాస్ గీతానికి రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించారు. యువన్ శంకర్ రాజా స్వరాలు సమకూర్చడంతో పాటు నకాష్ అజీజ్‌తో కలసి ఆలపించారు. ప్రశాంత్, ప్రభుదేవా, స్నేహ, లైలా కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఎజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ బేనర్ నిర్మిస్తోంది. సినిమాటోగ్రఫీ: సిద్ధార్థ నుని.

ఆర్.సి 16లో శివన్న



రామ్‌చరణ్, జాన్వీ కపూర్ జంటగా రూపొందుతున్న ఆర్.సి. 16 చిత్రానికి సంబంధించి ఓ ఆసక్తికరమైన అప్‌డేట్ శుక్రవారం వచ్చింది. చిత్ర పరిశ్రమలో అందరూ ఆప్యాయంగా 'శివన్న' అని పిలుచుకునే శివ రాజ్‌కుమార్ ఇందులో నటిస్తున్నారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా సినిమాలో ఆయన లుక్‌ను విడుదల చేశారు. తెలుగు చిత్ర పరిశ్రమలోకి ఆహ్వానిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. 'ఉప్పెన' చిత్ర దర్శకుడు బుచ్చిబాబు సానా దర్శకత్వంలో వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. సంగీత సంచలనం ఏ.ఆర్.రెహమాన్ ఈ సినిమాకు స్వరాలు అందిస్తున్నారు.

అప్పుడు సోలో.. ఇప్పుడు యుగళం



లవ్, రొమాంటిక్, ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్.. ఈ జానర్లలో రూపుదిద్దుకునే చిత్రాలను ప్రేక్షకులకు దగ్గర చేసేవి వాటిల్లో పాటలే. సంగీతం ఇంత ముఖ్య పాత్ర పోషిస్తుంది కనుక పాటల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తుంటారు. ప్రియదర్శి, నభా నటేశ్ జంటగా నటిస్తున్న 'డార్లింగ్' చిత్రం నుంచి ఇప్పటి వరకూ రెండు పాటలు విడుదలయ్యాయి. ఇవి ప్రియదర్శి, నభా నటేశ్‌ల సోలో సాంగ్స్. ఇప్పుడు వీరిద్దరూ కలిపి పాడుకున్న లవ్ సాంగ్ 'సున్ చెలియా' ను శుక్రవారం విడుదల చేశారు. కాసర్ల శ్యామ్ రాసిన ఈ పాటను అనురాగ్ కులకర్ణి పాడారు. వివేక్ సాగర్ సంగీత దర్శకుడు. ఈ నెల 19న విడుదల కానున్న ఈ చిత్రాన్ని అశ్విన్ రామ్ దర్శకత్వంలో కె.నిరంజన్‌రెడ్డి, శ్రీమతి చైతన్య నిర్మించారు.

చిన్న సినిమా... వసూళ్లలో మిన్న

ఈ మధ్యకాలంలో భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన చాలా చిత్రాలు బాక్సాఫీసు దగ్గర వసూళ్ల సునామీ సృష్టించడం చూసిందే. రూ. 300 కోట్లు, రూ. 500 కోట్ల వసూళ్లు అనే మాట చాలా సామాన్యంగా వినిపిస్తోంది. కానీ అవన్నీ భారీ బడ్జెట్‌తో తెరకెక్కడం వల్లే వసూళ్లు కూడా ఖర్చుకు తగిన స్థాయిలో వచ్చాయి. కానీ పరిమిత బడ్జెట్‌తో, అది కూడా ఎలాంటి స్టార్స్ లేకుండా వచ్చిన కొన్ని బాలీవుడ్ సినిమాలు రూ. వంద కోట్ల వసూళ్లను సాధిస్తున్నాయి. అగ్రహీరోలు, దిగ్గజ దర్శకులు లేకున్నా ఆకట్టుకునే కథలతో ప్రేక్షకులను అలరిస్తూ, కాసుల వర్షం కురిపిస్తున్నాయి.

ఓ సినిమా కమర్షియల్‌గా హిట్టా, ఫట్టా అనేది చెప్పడానికి రూ. 100 కోట్ల వసూళ్లు అనేది ఇప్పుడు ఓ కొలబద్దగా మారింది. అయితే అగ్రతారలకు సైతం అన్నిసార్లు ఈ ఫీట్ సాధ్యం కావడం లేదు. భారీ హైప్‌తో వచ్చిన పాపులర్ హీరోల చిత్రాలు సైతం బాక్సాఫీసు దగ్గర రూ. వంద కోట్ల వసూళ్లను దాటలేక చతికిలపడుతున్నాయి. దీనికి భిన్నంగా ఎలాంటి స్టార్స్ లేకుండా, కంటెంట్‌ను మాత్రమే నమ్ముకొని వచ్చిన కొన్ని చిన్న సినిమాలు బాలీవుడ్‌లో అలవోకగా వందకోట్ల మార్కును అధిగమిస్తున్నాయి.



కోట్లు కొల్లగొట్టిన పిల్లదెయ్యం



బాలీవుడ్ తాజా సంచలనం 'ముంజ్యా' చిత్రం రూ. వంద కోట్ల క్లబ్‌లో చేరింది. హారర్ కామెడీ జానర్ సత్తా ఏంటో మరోసారి చూపింది. ఇందులో పేరున్న బాలీవుడ్ తారాగణం లేదు. శార్వరీ వాఘ్, అభయ్ వర్మ లాంటి చిన్న నటీనటులే. దర్శకుడు ఆదిత్య సర్పోదర్‌కు గతంలో భారీ హిట్లు ఇచ్చిన వ్యక్తి కాదు. అయినా 'ముంజ్యా' మాత్రం విడుదలైన రెండు వారాల్లోనే రూ. వంద కోట్ల క్లబ్‌లో చేరింది. రూ. 30 కోట్లతో తెరకెక్కిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ. 150 కోట్ల వసూళ్లను సాధించింది. ఈ ఏడాది అత్యధిక వసూళ్లు సాధించిన హిందీ చిత్రాల్లో ఐదో స్థానంలో నిలిచింది.

అగ్రతారలు లేకున్నా కాసుల వర్షం


సీనియర్ నటీమణులు కరీనాకపూర్, టబు... యువ కథానాయిక కృతీసనన్ ప్రధాన తారాగణంగా రూపొందిన హీరోయిన్ ఓరియంటెడ్ మూవీ 'క్రూ' సైతం అంచనాలు మించి వసూళ్లను అందుకొంది. ప్రచార చిత్రాలతోనే ప్రేక్షకుల్లో ఆసక్తి ఏర్పడడంతో దాదాపు 2500 స్క్రీన్లలో ఈ చిత్రాన్ని విడుదల చేశారు. ఈ కామెడీ థ్రిల్లర్ ప్రపంచవ్యాప్తంగా రూ. 150 కోట్ల వసూళ్లను సాధించింది. స్టార్ హీరోల రేంజ్‌లో ఈ చిత్రం వసూళ్లను సాధించడం ఇండస్ట్రీ వర్గాలను ఆశ్చర్యపరిచింది.

కంటెంట్‌తోనే కలెక్షన్లు


కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370 రద్దు నేపథ్యంలో రూపొందిన హిందీ చిత్రం 'ఆర్టికల్ 370'. ఈ ఏడాది ఫిబ్రవరిలో విడుదలైంది. రూ. 20 కోట్లతో తెరకెక్కిన ఈ చిత్రం రూ. 110 కోట్ల వసూళ్లను సాధించింది. కథానాయికగా ఇప్పటివరకూ పెద్ద విజయాలు దక్కని యామీ గౌతమ్ ఈ సినిమాలో లీడ్‌రోల్ పోషించగా, ప్రియమణి కీలకపాత్రలో నటించారు. వీరు తప్ప పేరున్న నటీనటులెవరూ ఈ చిత్రంలో లేరు. ఆర్టికల్ 370ని తొలగించే క్రమంలో ప్రభుత్వానికి ఎదురైన సవాళ్లు, లోయలో శాంతి భద్రతలను కాపాడేందుకు మిలిటరీ చేసిన ఆపరేషన్స్‌ను దర్శకుడు ఆదిత్య సుహాస్ ఆవిష్కరించిన తీరు ప్రేక్షకులను మెప్పించింది. ఫలితమే బాక్సాఫీసు దగ్గర మంచి మార్కులు కొట్టేసింది.

సక్సెస్ బాటలో చిన్న సినిమా

కరోనా ప్రభావానికి బలైన చిత్రపరిశ్రమల్లో బాలీవుడ్‌ది అగ్రస్థానం. అప్పటివరకూ వరుస హిట్లతో కళకళలాడిన పరిశ్రమ కాస్తా ప్రేక్షకులు థియేటర్లకు రాక వెలవెలబోయింది. వరుస అపజయాలతో అగ్రహీరోలు, నిర్మాతలకు ఏం పాలుపోని పరిస్థితి. ఇంకా ఇప్పటికీ బాలీవుడ్ మునుపటి జోరు చూపించలేకపోతోంది. అగ్రహీరోలతో రూ. వందల కోట్లు ఖర్చుపెట్టి సినిమాలు తీసిన కొన్ని పెద్ద నిర్మాణ సంస్థలు దివాళా అంచుకు చేరాయి. ఈ పరిస్థితి ఇలా కొనసాగుతుండగా కొత్త తరహా కంటెంట్‌తో వచ్చిన కొన్ని చిన్న చిత్రాలు బాక్సాఫీసును దునేస్తున్నాయి.



అయితే కొంతమంది విమర్శకులు ప్రాపగాండా చిత్రాలుగా పేర్కొన్న 'ది కేరళ స్టోరీ', 'ది కశ్మీర్ ఫైల్స్' చిత్రాలు ఆశ్చర్యపరిచే వసూళ్లను సాధించాయి. మత మార్పిడికి గురైన అమాయక యువతి చివరకు సరిహద్దులు దాటి ఉగ్రవాద సంస్థ ఐసిస్ చెరలో బంధీగా మారిన వైనాన్ని ఇందులో చూపించారు. అదాశర్మ ప్రధాన పాత్ర పోషించిన ఈ చిత్రంలో పేరున్న బాలీవుడ్ నటీనటులు లేరు. కథ కూడా పూర్తిగా కేరళ నేపథ్యంలో సాగుతుంది. దక్షిణాదిన ఈ సినిమాకు కమర్షియల్‌గా లాభించకపోయినా ఈ సినిమా హిందీ వెర్షన్‌ను ప్రేక్షక లోకం అమితంగా ఆదరించింది. అందుకే రూ. 20 కోట్లతో తెరకెక్కిన ఈ చిత్రం ఏకంగా రూ. 250 కోట్ల వసూళ్లతో బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. 2022లో వచ్చిన 'కశ్మీర్ ఫైల్స్' చిత్రం సైతం రికార్డులను తిరగరాసిందనే చెప్పాలి. ఒక డాక్యుమెంటరీలా సాగే కథనంతో తెరకెక్కిన ఈ సినిమా ఊహించని వసూళ్లను సాధించింది. తొలి రోజు 600 స్క్రీన్లలో విడుదల చేస్తే, వారం తిరగకుండానే నాలుగు వేల స్క్రీన్లకు పెంచాల్సి వచ్చింది. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో రూ. 20 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన చిత్రం కాస్తా రూ. 300 కోట్ల వసూళ్ల మార్కును అధిగమించింది. బాలీవుడ్‌లో విక్కీ కౌశల్‌కు ఒక్కసారిగా స్టార్‌డమ్ సంపాదించిపెట్టిన చిత్రం 'యురి' కేవలం రూ. 25 కోట్ల వ్యయంతో తెరకెక్కింది. ఈ చిత్రం హిందీ బెల్ట్‌లోనే రూ. 250 కోట్ల వసూళ్లను రాబట్టింది. ప్రపంచవ్యాప్తంగా రూ. 350 కోట్ల వసూళ్లను రాబట్టింది. పలువురు అగ్రహీరోల చిత్రాలను పక్కకునెట్టి 2019లో అత్యధిక వసూళ్లు సాధించిన మూడో చిత్రంగా నిలిచింది.



వివిధ అవతారాల్లో జగన్నాథుడు

జగన్నాథ రథోత్సవాల్లో భాగంగా శుక్రవారం జగన్నాథ స్వామి వివిధ అవతారాల్లో భక్తులకు దర్శన మిచ్చారు. జిల్లాలోని వివిధ గుండిచా మందిరాల్లో ఉదయం నుంచి భక్తులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.
-ఆంధ్రజ్యోతి బృందం


సోంపేటలో వామనావతారంలో దర్శనమిచ్చిన జగన్నాథ స్వామి


శ్రీకాకుళం కల్చరల్: మొండేటి వీధిలో నృసింహావతారం


ఎల్ఎన్ పేట: పరశురామావతారంలో


నరసన్నపేట: రామావతారంలో..


శ్రీకాకుళం కల్చరల్: గుజరాతిపేటలో మత్స్యావతారం


ఇచ్ఛాపురం: శ్రీకృష్ణుని అవతారంలో

డీజిల్ సబ్సిడీ విడుదలపై మత్స్యకారుల హర్షం


సంతబొమ్మాళి: మంత్రి అచ్చెన్నాయుడును అభినందిస్తున్న మత్స్యకార నాయకులు

సంతబొమ్మాళి: మత్స్యకారుల వేటకు గాను సబ్సిడీపై డీజిల్ సరఫరాకు సంబంధించి రాష్ట్ర వ్యవ సాయ, మత్స్య శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు రూ.10 కోట్లు విడుదల చేయడంపై మండల మత్స్యకార నాయ కులు సురాడ ధనరాజ్, వారాధి చంటి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంత్రిగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన అచ్చెన్నాయుడును వారు మర్యాద పూర్వకంగా కలిశారు. అచ్చెన్నాయుడు బాధ్యతలు స్వీకరించిన తొలి రోజే డీజిల్ సబ్సిడీ విడుదల చేస్తూ సంతకం చేసి మత్స్యకారులను ఆదుకున్నారన్నారు. అలాగే వైసీపీ ప్రభుత్వంలో తీసువచ్చిన 217 జీవో రద్దు చేసి మత్స్యకారులు బతుకుల్లో వెలుగులు నింపా రన్నారు. ● **నందిగాం:** మంత్రి అచ్చెన్నాయుడు బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి మండ లం నుంచి టీడీపీ నేతలు, కార్యకర్తలు తరలివెళ్లి శుభా కాంక్షలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో నాయకులు పి.అజయ్‌కుమార్, పి.చంద్రశేఖర్, ఎం.బాలకృష్ణ, టి.ఉమా మహేష్, బి.గిరి, జీరు నానీరెడ్డి, విశ్వనాథం, పి.జోగారావు, ఎస్.జానకిరాం, ఎస్.కృష్ణారావు ఉన్నారు.

ఇసుక తవ్వకాలు చేపట్టిన ఎక్స్‌కవేటర్ సీజ్

హిరమండలం: హిరమండలం వద్ద వంశధార నదిలో ఇటీవల అక్రమ తవ్వకా లు చేపట్టిన ఎక్స్‌క వేటర్‌ను తహసీల్దార్ సుధాకర్ సీజ్ చేశారు. నదిలో అర్థరాత్రి ఎక్స్‌కవేటర్‌తో ఇసుకను అక్ర మంగా తవ్వి లారీల్లో ఇతర ప్రాంతాలకు తరలించడంపై ఈనెల 9న 'ఆంధ్రజ్యోతి'లో 'తవ్వేసి.. తరలించేసి' శీర్షికతో కథనం వచ్చిన సంగతి తెలిసిందే. దీనికి స్పందించిన అధికారులు నదిలోకి వాహనాలు వెళ్లకుండా పలు చోట్ల కందకాలు తవ్వించారు. అలాగే గురువారం సాయంత్రం గొట్టాబ్యారేజీ దిగువన మెట్ట తోటలో అక్రమార్కులు దాచిన ఎక్స్‌కవేటర్‌ను పోలీసుల సాయంతో సీజ్ చేసి తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సుధాకర్ మాట్లాడుతూ.. ఇసుక తవ్వకందారులు మూడు రోజులుగా మెట్ట తోట వద్ద ఎక్స్‌కవేటర్‌ను దాచిపెట్టగా గుర్తించి కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లామని, ఆయన ఆదేశాల మేరకు సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

ఉద్యోగాల నుంచి తొలగించడంపై నిర్వాసితుల ఆందోళన


ఆందోళన చేస్తున్న నిర్వాసితులు

సంతబొమ్మాళి: మూలపేట పోర్టులో నిర్వాసిత గ్రామాలైన మూలపేట, విష్ణుచక్రంలకు చెందిన 17 మందిని ఉద్యోగల నుంచి తొలగించడంపై శుక్రవారం గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. పోర్టు నిర్మాణానికి భూములిచ్చి సర్వస్వం కోల్పోయిన తమను ఉద్యోగాల నుంచి ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. పది రోజుల పాటు మూలపేట గ్రామస్థులకు పనులు నిలుపుదల చేయాలని యాజమాన్యం చెప్పగా అందరికీ పనులు నిలుపుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. పోర్టు నిర్మాణానికి తాము వ్యతిరేకం కాదని నిర్వాసితుందరికీ ఉద్యోగాలు కల్పించాలని డీజీఎం ఉమామహేశ్వరరావును కోరినట్లు సర్పంచ్ జీరు బాబూరావు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగ కుండా టెక్కలి సీఐ చంద్రమౌళి, నౌపడ ఎస్ఐ కిశోర్ వర్మ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పలాస: కాశీబుగ్గ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో 33/11 కేవీ విద్యుత్ లైన్ నిర్వహణ కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ జీప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జీఎంఈ కాలనీ, ఆర్‌కె పురం, పెంటిభద్ర, జేఆర్‌సీపురం, పద్మనాభపురం కాలనీ, నీలాపురం, తాళభద్ర, నర్సిపురం, చిన్నబడాం, అంతరకుడ్డ, పెసరపాడు, కోసంగిపురం, రాజపురం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

● **రావిచెంద్రి(ఎల్.ఎన్.పేట):** రావిచెంద్రి జంక్షన్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శనివారం మరమ్మతులు చేపడుతున్నందున ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలవరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ జి.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని వినియోగదారులందరూ ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

● **సంతబొమ్మాళి:** నౌపడ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంత రాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ ఎం.శివకుమార్ తెలిపారు. సబ్ స్టేషన్ మెయింటెనెన్స్ కారణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

● **నందిగాం:** మదనాపురం 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంత రాయం కలుగుతుందని టెక్కలి ట్రాన్స్‌కో ఈఈ శంకరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్నామన్నారు. అందువల్ల మదనాపురం, దిమ్మిడిజోల, దీన బంధుపురం, కల్లాడ, హర్షబాడ, బర్తుపురం, నౌగాం తదితర గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నటు పేర్కొన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

● **జలుమూరు:** చల్లవానిపేట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మెయింటెనెన్స్ పనుల నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టెక్కలి ఈఈ జి.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు చల్లవానిపేట సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

● **జలుమూరు (సారవకోట):** సారవకోట మండలం నౌతల విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు టెక్కలి విద్యుత్ ఈఈ జి.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. నౌతల సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్నందున ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటలు వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. దీంతో నౌతల, ధర్మలక్ష్మీపురం, దాసుపురం, మాలువ, బొంతు, చినకిట్టాలపాడు, కురిడింగి, మహాసింగి, గాతలపేట, నారాయణపురం, పెద్దలంబ తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

● **శ్రీకాకుళం:** టెక్కలి ఆదీఆంధ్రా వీధి 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం వార్షిక మరమ్మ తులు చేపడుతున్నందున ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ జి.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. టెక్కలి పట్టణంలోని పాత పలాస రోడ్డు, అయ్యప్పనగర్, భవానీనగర్, భీంపురం, మేఘవరం, బొరిగిపేట ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

● పోలాకిలో...

పల్లిపేట(పోలాకి): పోలాకిలోని 33/11కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్నందున శనివారం వివిధ గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టెక్కలి ఈఈ శంకరరావు, పోలాకి ఏఈ విశ్వేశ్వరరావు తెలిపారు. ఈ నేపథ్యంలో పోలాకి సబ్ స్టేషన్ పరిధిలోని పల్లిపేట, పోలాకి, ఉర్జాం, మెట్టపేట, నందిగాం, రేవునందిగాం, అంపలాం, గంటపేట, గోవిందపురం, డోల, వెదుళ్లవలస, రాజారంపురం, మొగిలిపిల్లిపేట, అంబీరుపేట, చెల్లాయివలస, కొత్తరేవు అక్కువరం, పరపతివానిపేట తదితర గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కౌలు రైతులు గుర్తింపు కార్డు పొందాలి

నందిగాం: కౌలు రైతులు సాగుకు సంబంధించి గుర్తింపుకార్డులు పొందాలని వ్యవసాయాధికారి పి.శ్రీకాంత్‌వర్మ అన్నారు. శుక్రవారం కవిటిఅగ్రహారం, పెద్దబాణాపురం రైతు సేవా కేంద్రాల్లో కౌలు రైతుల అవగాహన సదస్సులు నిర్వహించారు. ● **మందస:** కౌలు రైతులు గుర్తింపు కార్డులు కలిగి ఉండాలని ఈవో బి.నవీన్ కోరారు. మందస సచివాలయంలో శుక్రవారం కౌలు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశంలో సుభాష్ పాణిగ్రాహి, డి.మార్కండేయులు, గార కృష్ణంరాజు, జి.లక్ష్మీనారాయణ, బి.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు స్థలాలు కేటాయించండి

● కలెక్టర్, జేసీలను కోరిన పలాస ఎమ్మెల్యే శిరీష


కలెక్టర్, జేసీతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష

పలాస, జూలై 12: పలాసలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు స్థలాలను కేటాయించాలని ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. ఈ మేరకు శుక్రవారం శ్రీకాకుళం కలెక్టరేట్‌లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ నవీన్‌లను కలిసి వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పలాసలో ఇంటిగ్రేటెడ్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్, కృషి విజ్ఞాన కేంద్రం, జీడి పరి శోధన కేంద్రం నిర్మాణాలు చేపట్టనున్నందున స్థలాలు కేటాయించాలన్నారు. మత్స్యకారులకు వినియోగపడే సీమెన్, మర్చంట్ నేవీ ఇనిస్టిట్యూట్ ఏర్పాటు చేసి వారికి ఉపాధి కల్పించేందుకు సంకల్పించామని, దీనికి అవసరమైన భూములు ఇప్పించాలని కోరారు. కృషి విజ్ఞాన కేంద్రం, జీడి పరి శోధనా కేంద్రా లకు అవసరమైన భూములు కేటాయిస్తే ప్రభుత్వంతో చర్చించి త్వరితగతిన పనులు పూర్తి చేస్తామన్నారు. గతంలో ఏపీఐఐసీకి కేటాయించిన 61 ఎకరాల స్థలం కోర్టు వివాదంలో ఉండిపోయిందని, దీన్ని త్వరితంగా పరిష్కరించి వ్యాపారులకు అందించాలని కోరామన్నారు. గిరి జనుల సాగులో ఉన్న భూములకు హక్కులు కల్పించి వారి జీవనోపాధికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని, ఇరిగేషన్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలని కోరారు. వీటిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారని, వీటికి సంబంధించిన పనులు వేగవంతం అవుతాయని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఆమె వెంట టీడీపీ జిల్లా కార్యదర్శి పీరుకట్ల విఠల్‌రావు, వ్యాపారవేత్త మల్లా శ్రీనివాసరావు ఉన్నారు. ● స్థానిక టీడీపీ కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖాధికారులతో ఎమ్మెల్యే గౌతు శిరీష సమీక్ష నిర్వ హించారు. నియోజకవర్గంలో గతంలో ఎన్ని ఇళ్లు మంజూరయ్యాయి, ఎన్ని పూర్తయ్యాయని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ నగేష్, డీఈఈ కె.అప్పారావు, ఏఈలు రాంబాబు, వైకుంఠ రావు, శ్రీకాంత్, రాజ్‌మోహన్ పాల్గొన్నారు.

నవంబరు 9,10 తేదీల్లో మందసలో స్వర్ణోత్సవాలు

● యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు


మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

హరిపురం: విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు నవంబరు 9, 10 తేదీల్లో మందసలో నిర్వహించనున్నట్లు యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. వెంకటేశ్వర్లు అన్నారు. హరిపురం హైస్కూల్ ఆవరణలో శుక్రవారం సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ స్వర్ణోత్సవాల్లో విద్యారంగాన్ని కాపాడేందుకు దోహదపడే అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలతో విద్యా వ్యవస్థ భ్రష్టుపట్టిపోయిందని విమర్శం చారు. కొత్త ప్రభుత్వం వెంటనే 117 జీవో రద్దు చేసి సమాంతర మీడియం విధానాన్ని ప్రవేశపెట్టాలని కోరారు. స్వర్ణోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎల్.బాబూరావు, బి.శ్రీరామ్మూర్తి, మండల అధ్యక్ష, కార్యదర్శులు గున్న రమేష్, వై.వాసుదేశరావు, ప్రతిని ధులు గుంట కోదండరావు, కంచరాన మాధవరావు, జగదీష్, దాసరి ఈశ్వరరావు, రవికుమార్, తారకేశ్వరరావు పాల్గొన్నారు.

సమస్యలపై సంఘటితంగా పోరాడాలి

హిరమండలం: ఉపాధ్యాయుల సమస్యలపై సంఘాలు సంఘటితంగా పోరాడాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మజ్జి మదన్‌మోహన్ అన్నారు. శుక్రవారం కేజీబీవీ, అవలంగి, తంప ఉన్నత పాఠ శాలలను సందర్శించారు. ఈ సందర్భంగా సభ్యత్వ నమోదు చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ.. 117 జీవో రద్దు, జడ్పీ పీఎఫ్, ఏపీజీఎల్ఐ అంశాలపై ప్రభుత్వంతో పోరాటానికి సిద్ధంగా ఉండాల న్నారు. తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలలకే అమలు చేయడం ద్వారా బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం హిరమండలం శాఖ అధ్యక్షుడు ఎ.సింహాచలం, కార్యదర్శి ఎం.వేణు గోపాలరావు, ప్రతినిధులు జి.రమేష్, డి.రమేష్, చక్రధర్, ఎం.గంగేశ్వరి, కె.సింహాచలం, పి.చిట్టయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్

హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోండి

● టెక్కలి ఇన్‌చార్జి సీనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న టెక్కలి ఇన్‌చార్జి సీనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీనివాసరావు


పాతపట్నం: మాట్లాడుతున్న జూనియర్ సివిల్ న్యాయాధికారి తేజా చక్రవర్తి

శ్రీకాకుళం: ద్విచక్ర వాహనదారులతో పాటు వెనుక కూర్చొనే వ్యక్తి కూడా హెల్మెట్ ధరించడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవాలని టెక్కలి ఇన్‌చార్జి సీనియర్ సివిల్ న్యాయాధికారి జె.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం టెక్కలి ఐతం కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువతీ, యువకులు ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నారని, హెల్మెట్ లేకపోవడం వల్ల తలకు తీవ్రమైన గాయాలై మరణాలు సంభవిస్తున్నాయన్నారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో టెక్కలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దివ్వల వివేకానంద, న్యాయవాదులు పి.సాయిరాజ్, పి.ఆనందరావు, పి.మధుబాబు, కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వీవీ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఎంపీడీఓ డి.సంజీవరావు, ఎస్ఐ టి.నరింగరావు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ బాధ్యతగా భావించాలి

పాతపట్నం: హెల్మెట్‌ను ధరించడం బరువుగా కాకుండా బాధ్యతగా స్వీకరించాలని జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎస్‌హెచ్‌ఆర్ తేజా చక్రవర్తి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆదర్శ డిగ్రీకళాశాల, సబ్ జైలులో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకుండా ప్రమాదాలకు గురైతే ఎటువంటి బీమా వర్తించదన్నారు. హెల్మెట్‌ను పెట్టుకోవడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమాల్లో న్యాయవాది బీఈ సత్యనారాయణ, ఎస్ఐ మహమ్మద్ యాశిన్, ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించి రోల్ మోడల్‌గా ఉండాలి

నరసన్నపేట: పోలీసు సిబ్బంది కూడా ద్విచక్ర వాహనాలు నడిపేట ప్పుడు హెల్మెట్ ధరించి ఇతరులకు రోల్ మోడల్‌గా నిలవాలని సీఐ బి. ప్రసాదరావు అన్నారు. శుక్రవారం న్యాయవిజ్ఞాన సదస్సులో భాగంగా పోలీసులు స్టేషన్ వద్ద సిబ్బందికి అవగాహన కల్పించారు. ప్రమాదాలు జరిగే సమయంలో క్షతగాత్రుల ప్రాణాలు కాపాడేలా పోలీసులు వ్యవహరించాలన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించేలా ద్విచక్రవాహన చోదకులకు అవగాహన కలిగించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ అశోక్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


వేలం పాట ఖరారు

శ్రీకాకుళం: కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి దేవస్థానంలో శుక్రవారం వివిధ అంశాలకు సంబంధించి వేలంపాట నిర్వహించారు. గ్రూపు దేవాలయాల ఈవో పి.మనస్వి ఆధ్వర్యంలో నిర్వహించిన వేలం పాటలో తాళ్లు, రక్షలు, ఫొటోలు విక్రయించుకునేందుకు దేవాది అప్పలనాయుడు రూ.3.48 లక్షలకు దక్కించుకున్నారు. చీరలు జాకెట్టు ముక్కలకు ఉర్జాన కొండలరావు రూ.87 వేలకు, కొబ్బరి చెక్కలకు ఉర్జాన రాము రూ.2.78లక్షలకు దక్కించుకున్నారు. ఈ మూడు వేలం పాటల్లో గతం కంటే రూ. 34,300 అద నంగా వచ్చినట్లు ఈవో వాకచర్ల రాధాకృష్ణ తెలిపారు.

108 సేవలపై ఆరా

నందిగాం: నందిగాంలో 108 వాహన సేవలపై 108 డివిజనల్ అధికారి జి.జగన్నాథ్ ఆరా తీశారు. శుక్రవారం వాహన పనితీరును, మందుల వివరాలు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. సేవలను విస్తృత పరచాలని సూచించారు. అనంతరం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.అనితను కలిసి ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలకు 108 సేవలపై అవగాహన కలిగించి, ప్రజలు వినియోగించుకునేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఈఎంటీ బి.రాము, పైలెట్ ఎస్.చిరంజీవి ఉన్నారు.

టీడీపీ సీనియర్ నేత దాసరి మృతి


శ్రీరాములు(ఫైల్)

హరిపురం: సువర్ణాపురం టీడీపీ గ్రామ అధ్యక్షుడు, సీనియర్ నాయకులు దాసరి శ్రీరాములు (60) శుక్రవారం మృతిచెందారు. గత రెండు రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్దనే చికిత్స పొందుతూ అకస్మాత్తుగా మృతిచెందారని కుటుంబ సభ్యులు తెలిపారు. శ్రీరాములు మృతి పట్ల టీడీపీ నేతలు జీకే నాయుడు, దాసరి తాతారావు, బావన దుర్యోధన, రట్టి లింగరాజు, మండల లచ్చయ్య, కొరికాన వాసు, బమ్మిడి కర్రయ్య తదితరులు సంతాపం తెలిపారు.

ఏకవార్షిక పశుగ్రాసంపై దృష్టి సారించాలి

పాతపట్నం: ఏక వార్షిక పశుగ్రాసాలపై దృష్టి సారించాలని పశుసంవర్ధక శాఖ ఏడీ డా. మంచు కరుణాకరరావు అన్నారు. పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా దేవుదళ గ్రామంలో రైతులకు పాడి పరిశ్రమలో ఆధునిక విధానాలపై అవగాహన కలిగించారు. ప్రతీ రైతు తనకున్న భూమిలో 10 సెంట్లను పశుగ్రాసం పెంపకానికి వినియోగించాలన్నారు. తద్వారా అధిక లాభం పొందవచ్చన్నారు. పశుగ్రాసం పెంపకం ద్వారా దాణా ఖర్చు గణనీయంగా తగ్గుతుందన్నారు. ధాన్యజాతి పశు గ్రాసాలు 2:3 నిష్పత్తిలో పశువుల మేపులో వినియోగించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది , పాడి రైతులు పాల్గొన్నారు.

పశుగ్రాసం సాగుతో తగ్గనున్న దాణా ఖర్చు

శ్రీకాకుళం: పాడి రైతులు పశు గ్రాసాలను సాగుచేయడం ద్వారా దాణా ఖర్చును తగ్గించుకో వచ్చని టెక్కలి పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ జి.రఘునాథ్ అన్నారు. పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం లింగాలవలస పంచాయతీ హరిపురంలో పాడి రైతులకు పలు సూచనలు చేశారు. అన్ని రైతు సేవా కేంద్రాల్లో 75 శాతం రాయితీతో పశుగ్రాస విత్తనాలు అందిస్తున్నామన్నారు. ఐదు కిలోల విత్తనాల బ్యాగు రూ.460 కాగా ప్రభుత్వ సబ్సిడీ రూ.345 మినహాయించి రైతు రూ.115లకే అందిస్తున్నామన్నారు. పాడిరైతు పశుగ్రాసాలను సాగు చేయాలని కోరారు. సర్పంచ్ సంపతిరావు లక్ష్మి, లింగాలవలస పశువైద్యాధికారి ఎం.పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

పశుగ్రాసంతో అధిక పాల ఉత్పత్తి

శ్రీకాకుళం: నాణ్యమైన ప్రశుగ్రాసాన్ని పండించి శాస్త్రీయ పద్ధతిలో పశువులకు మేపినట్లయితే అధిక పాల ఉత్పత్తి సాధించవచ్చని పశుసంవర్ధశాఖ ఏడీ డాక్టర్ ఎం.లోకనాథం అన్నారు. పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం కోటబొమ్మాళి మండలం నిమ్మాడ గ్రామంలో పాడి రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం పశుగ్రాస విత్తనాలను పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు రైతులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

అనుమతులు లేని లేవుట్లను గుర్తించాలి


లే అవుట్ రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

మెళియాపుట్టి: అనుమతులు లేని లేఅవుట్లను గుర్తించి నోటీసులివ్వాలని టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ ఆదేశించారు. శుక్రవారం వసుంధర గ్రామంలో లేవుట్లను పరిశీలించారు. రెవెన్యూ అనుమతులు కచ్చితంగా తీసుకోవాలన్నారు. నాలా వసూలుపై దృష్టి సారించాలన్నారు. కార్యక్ర మంలో తహసీల్దార్ జానకమ్మ తదితరులున్నారు.

ఆక్రమణల తొలగింపు


అక్రమ నిర్మాణాన్ని తొలగిస్తున్న దృశ్యం

పలాస: మొగిలిపాడు హైవే పట్టణ ఆరోగ్యకేంద్రం సమీపంలో ఆక్రమణలను రెవెన్యూ అధికారులు తొలగించారు. సర్వే నెంబరు 246/3లో నాలుగు సెంట్ల స్థలాన్ని పట్టణ ఆరోగ్య కేంద్రం నిర్మించిన ప్రాంతంలో వైసీపీ నాయకులు కొంతమంది కబ్జా చేసి గృహాన్ని నిర్మించారు. దీనిపై ఫిర్యాదులు రావడంతో ఆర్ఐ నిరంజన్ ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్నం తొలగించారు. అదేవిధంగా శివాజీ నగర్‌లో ఆక్రమణలు కూడా సంపూర్ణంగా తొలగించారు.

పాతపింఛన్ విధానాన్ని కొనసాగించాలి

● రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న శ్రామిక్ యూనియన్ నేతలు

పలాస: పాత పింఛన్ విధానాన్ని కొనసాగించాలని కోరుతూ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక రైల్వే స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘ అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ మట్ట రామకృష్ణ మాట్లాడుతూ.. పింఛన్ లేకపోవడం వల్ల కార్మికుల భవిష్యత్ అగమ్యగోచరంగా తయారైందన్నారు. కేంద్రప్రభుత్వం పునరాలోచించి పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. కొత్త నియామకాలు చేపట్టాలని, ప్రైవేటు విధానానికి స్వస్తి పలకాలని, ఉద్యోగులకు గృహాలు నిర్మించాలని, రైల్వే కాలనీలో తాగునీటి సమస్యలు పరిష్కరించాలని, రన్నింగ్ స్టాఫ్, ఇంజనీరింగ్ సిబ్బందికి అదనపు సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు పీవీవీ ఎన్‌రావు, ఎం.ఉమాశంకర్, పీఎస్‌రావు, పీఎల్ కృష్ణ, జీఎల్‌కేరెడ్డి, డీవీరావు పాల్గొన్నారు.

ఉజ్జుడు మెట్ట రైతుల సమస్యలు పరిష్కరించాలి

పలాసరూరల్: రామకృష్ణాపురం వద్ద ఉన్న ఉజ్జుడు మెట్టకు ఆనుకొని సాగు చేస్తున్న రైతుల భూములు కొంతమేర ఆక్రమణలకు గురయ్యాయని, వారికి న్యాయం చేయాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. నీలావతి గ్రామంలో శుక్రవారం సమావేశం నిర్వ హించారు. దీనిపై గతం లో రైతుల ఆధ్వర్యంలో పోరాటాలు చేసినా ఫలితం లేదన్నారు. ప్రస్తుతం సాగు చేస్తున్న రైతుల భూములకు 1బి, అడంగల్ రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వమైనా ఉజ్జుడుమెట్ట రైతుల భూముల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో వామపక్షనాయకులు సౌర లక్ష్మణరావు, చాపర వేణుగోపాల్, ఎం.రామారావు, వంకల మాధవరావు, ఎన్.గణపతి పాల్గొన్నారు.

ఆధార్ సేవలు పునరుద్ధరించాలి

హిరమండలం: హిరమండలం పోస్టాఫీసులో నిలిచి పోయిన ఆధార్ సేవలను పునరుద్ధరించాలని జడ్పీటీసీ పి.బుచ్చిబాబు కోరారు. గత కొన్ని రోజులుగా పోస్టాఫీస్‌లో ఆధార్ సేవలు నిలిచి పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రింటర్ మరమ్మతులకు గురైందని సిబ్బంది చెబుతున్నారని తక్షణం బాగుచేసి సేవలు అందించాలని కోరారు. సచివాలయంలో ఆధార్ కేంద్రం ఉన్నప్పటికీ అరకొర సేవలు అందిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

ఎరువుల పంపిణీ

కొత్తూరు: లబ్బ పంచాయతీ రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం రైతులకు ఎరువులను పంపిణీ చేశారు. ప్రభుత్వం సబ్సిడీ ధరలపై అందిస్తున్న విత్తనాలు, ఎరువులు, యంత్రాలను వినియోగిం చుకోవాలని టీడీపీ నాయకుడు లోతుగెడ్డ తులసీవర ప్రసాదరావు కోరారు. కార్యక్రమంలో పాలక రామ్మోహన్‌రావు, నిమ్మక మంగులు, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి తిమడాం ఆర్టీసీ బస్సు పునరుద్ధరణ

జలుమూరు: నరసన్నపేట నుంచి తిమడాం గ్రామానికి ఆర్టీసీ బస్సును పునరుద్ధరిస్తున్నారని జలుమూరు ఏఎంసీ మాజీ అధ్యక్షుడు వెలమల చంద్రభూషణరావు ఒకప్రకటనలో తెలిపారు. గతంలో ఈ సర్వీస్ ఉండేదని, వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత నిలుపుదల చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి ఇచ్చిన తరువాత ఈ సమస్యను కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆర్టీసీ అధికారులతో చర్చించారన్నారు. శనివారం నుంచి బస్సు సర్వీసును పునరుద్ధరించనున్నట్లు తెలిపారు.

నరసన్నపేటలో భారీవర్షం

నరసన్నపేట: మండలంలో పలు గ్రామాల్లో శుక్రవారం కుండపోత వర్షం కురిసింది. గతవారం రోజులుగా ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరైన ప్రజలు ఈ వర్షంతో ఉపశమనం పొందారు. పలు గ్రామాల్లో నారుమళ్లకు జీవం పోసింది. పట్టణంలో గంటసేపు వర్షం కురవడంతో ఆర్టీసీ కాంప్లెక్స్, మార్కెట్ వీధిలో నీరు చేరి ప్రజలు ఇబ్బందిపడ్డారు.

గుర్తు తెలియని యువకుడి మృతి


గుర్తుతెలియని యువకుని మృతదేహం

వజ్రపుకొత్తూరు: పూండి-పలాస రైల్వేస్టేషన్ మధ్య ట్రాక్‌పై గుర్తుతెలియని యువకుడి మృతదేహం పడి ఉందని పలాస రైల్వే ఎస్‌ఐ షరీఫ్ తెలిపారు. రైలు ప్రమాదంలో మృతిచెంది ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసినవారు 944067567 ఫోన్ నెంబరులో సంప్రదించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

జలుమూరు: లింగాలవలస వద్ద శుక్రవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొర్ను సూర్యనారాయణ తీవ్రంగా గాయపడినట్టు హెచ్‌సీ జి.రాజశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. మబగాం గ్రామానికి చెందిన సూర్యనారాయణ ఎల్‌ఎన్ పేట మండలం కృష్ణాపురం గ్రామంలో పరామర్శకు వెళ్లి తిరిగి ద్విచక్ర వాహనంపై వస్తుండగా.. లింగాలవలస వద్ద నరసన్నపేట నుంచి చల్లవానిపేట వైపు వస్తున్న వ్యాన్ ఢీకొంది. దీంతో అతడి కుడికాలికి, తలకు బలమైన గాయాలయ్యాయి. క్షతగాత్రుడ్ని 108 వాహనంలో నరసన్నపేట ప్రైవేట్ ఆసుపత్రికి తరలించినట్టు ఆయన తెలిపారు. సూర్యనారాయణ ఫిర్యాదు మేరకు వ్యాన్ డ్రైవరుపై కేసు నమోదు చేసినట్టు హెచ్‌సీ తెలిపారు.

పట్టుబడిన బైక్ దొంగలు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ దివాకర్ యాదవ్

సరుబుజ్జిలి: జిల్లాలోని పలు ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడిన ఇద్దరు వ్యక్తులు పోలీసులకు పట్టుబడ్డారు. ఈ మేరకు శుక్రవారం ఇందుకు సంబంధించిన వివరాలను సీఐ జి.దివాకర్ యాదవ్ విలేకరుల కు వివరించారు. ఇటీవల ఆమదాలవలస పోలీస్ స్టేషన్ పరిధిలో జొన్నవలస, మెట్టక్కివలస ప్రాంతాల్లో రెండు ద్విచక్ర వాహనాలు చోరీకి గురైనట్టు ఫిర్యాదులు అందా యన్నారు. ఈ క్రమంలో శుక్రవారం ఎస్‌ఐ వెంకటేష్‌తోపాటు సిబ్బంది స్థానిక వై ఎస్‌ఆర్ జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా.. శ్రీకాకుళం పట్టణానికి చెందిన బొమ్మలాట మోహన్, శ్రీనివాసరావు దొంగిలించిన ద్విచక్ర వాహనాలపై వస్తుండగా పోలీసులు అడ్డుకుని తనిఖీలు చేయడంతో విషయం బయటపడింది. వీరిని విచా రించగా.. జొన్నవలస, మెట్టక్కివలస, ఎచ్చెర్లకు సంబంధించిన మూడు ద్విచక్ర వాహనాలతో పాటు మరో మూడు ద్విచక్ర వాహనాలను వీరు దొంగిలించినట్టు గుర్తించారు. శ్రీకాకుళం, లావేరు, నరసన్నపేట పోలీస్‌స్టేషన్లలో వీరిద్దరిపై కేసులు నమోదైనట్టు సీఐ తెలిపారు. ఎస్‌ఐ వెంకటేష్‌తో పాటు కానిస్టేబుల్ నాయుడు, శ్యామ్, బాలును సీఐ అభినందించారు.

ఆస్తి తగదాలో ఒకరిపై కేసు నమోదు

శ్రీకాకుళం: కోటబొమ్మాళి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన మట్ట సింహాచలం ఆస్తి వివాదంలో తనపై దాడి చేసి గాయపరిచారని ఇదే గ్రామానికి చెందిన మట్ట శ్రీను శుక్రవారం ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఆస్తి విషయంలో గ్రామ పెద్దల సమక్షంలో మాట్లాడుతుండగా సింహాచలం తనపై దాడి చేశాడన్నారు. ఈ దాడిలో తీవ్ర గాయాలు కాగా టెక్కలి ప్రభుత్వ ఆసుపత్రి కోసం వెళ్లగా తలకు కుట్లు వేశారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

అక్రమ కట్టడాలు కూల్చివేత


అక్రమ నిర్మాణాలను జేసీబీతో తొలగిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం: తులసిగాం గ్రామ సచివాలయ భవనం పక్కనే ఎటువంటి అనుమతులు లేకుండానే గత ప్రభుత్వ హయాంలో వైసీపీ నాయకులు నిర్మించిన కట్టడాలను అధికారులు జేసీబీ సాయంతో కూల్చివేయించారు. శుక్రవారం ఉదయం రెవెన్యూ అధికారులు సమక్షంలో పునాదులు తొలగించారు. సచివాలయం పక్కనే ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని ఇటీవల ధర్మపురం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే అశోక్‌కు గ్రామస్థులు, టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. తక్షణమే పరిశీలించి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో పరిశీలించిన అధికారులు అక్రమ కట్టడాలుగా గుర్తించి జేసీబీతో తొలగించారు. కాగా తులసిగాం గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు కొంతమంది లబ్ధిదారులు నుంచి రూ.లక్షల్లో డబ్బులు వసూలు చేసుకుని స్థలాలను అప్పగించారని, అప్పట్లో గ్రామస్థులు అడ్డుపడినా స్థానిక వైసీపీ నాయకులు దౌర్జన్యం చేసి పునాదులు నిర్మించారని టీడీపీ నాయకులు ఆరోపించారు.

మొక్కు తీర్చుకుంటున్న టీడీపీ అభిమాని

● సింహాద్రి అప్పన్న దర్శనానికి సైకిల్ యాత్ర


దొయాస్వామిని అభినందిస్తున్న టీడీపీ నాయకులు



కంచిలి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే సింహాచలం వరాహ లక్ష్మీనారసింహ స్వామి దేవాలయానికి సైకిల్‌పై వచ్చి మొక్కుతీర్చుకుంటానని కంచిలి గ్రామానికి చెందిన గుడియా నర్సింగ్ సాహు (దొయాస్వామి) మొక్కుకున్నాడు. ఈ క్రమంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోపాటు ఇచ్ఛాపురం ఎమ్మెల్యేగా బెందాళం అశోక్‌బాబు కూడా గెలవడంతో శుక్రవారం ఉదయం సైకిల్‌పై మొక్కు చెల్లించుకునేందుకు బయలుదేరారు. ఈ సందర్భంగా స్థానిక టీడీపీ నాయకులు ఈ సైకిల్ యాత్రను ప్రారంభించారు. కార్యక్రమంలో మాదిన రామారావు, కురయ్య, జగదీష్ పట్నాయక్, తమరాల శోభన్ బాబు, ఎంఎం పట్నాయక్, టీవీ రమణ, మద్దిల ఆనంద్, సనపల కామేష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అంతటా భారీవర్షం


జి.సిగడాం: మర్రివలస పొలాల్లో చేరిన వర్షపు నీరు

అరసవల్లి/ జిసిగడాం/ లావేరు: జిల్లా అంతటా శుక్రవారం భారీవర్షం కురిసింది. కొన్నాళ్లగా ఆకాశం వైపు చూస్తున్న రైతులకు ఈ వర్షంతో ఉపశమనం లభించింది. శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తీవ్ర ఉక్కపోతగా ఉండగా.. సాయంత్రం ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో ఈదురుగాలులు.. భారీవర్షం కురిసింది. ఆమదాలవలసలో కుండపోతగా వర్షం కురిసింది. ఏకంగా 50.25 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఎచ్చెర్లలో 40.75, నందిగాంలో 19.0, శ్రీకాకుళంలో 14.5, గార 7.0, హిరమండలం 7.0, కవిటి 7.0, పలాస 6.25, జి.సిగడాం 5.5, కోటబొమ్మాళి 4.75, రణస్థలం 4.5, సంతబొమ్మాళి 4.5, బూర్జ 1.0, ఎల్‌ఎన్ పేట 0.5 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం కురిసింది. శ్రీకాకుళం నగరంతోపాటుగా.. అన్నిచోట్లా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పిడుగుల మోతకు ప్రజలు భయాందోళనకు గురయ్యారు.

గిరిజన ఆశ్రమంలో సమస్యల తిష్ట

● హాస్టల్ పరిసరాల్లో పేరుకుపోయిన మురుగు
● పెరిగిన దోమల బెడద ● ఇబ్బందిపడుతున్న విద్యార్థులు ● పట్టించుకోని అధికారులు


గిరిజన సంక్షేమ ఆశ్రమం బయట పేరుకుపోయిన మురుగు నీరు

(శ్రీకాకుళం అర్బన్/అరసవల్లి)

నగరంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమంలో సమస్యలు తిష్ట వేశాయి. ఆశ్రమంలో వార్డెన్ పర్యవేక్షణ లోపం, చుట్టు పక్కల పేరుకుపోయిన మురుగుతో విద్యార్థులు తరచూ రోగాల బారిన పడుతున్నారు. ఇటీవల ఇదే ఆశ్రమంలో ఉన్న 13 మంది విద్యార్థుల్లో కొందరు కల్తీ ఆహారం తిని, మరి కొందరు పారిశుధ్య సమస్య కారణంగా అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. వారంతా మూడు రోజుల పాటు రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స తీసుకుని ఆశ్రమానికి చేరుకున్నారు. అయితే విద్యార్థులు అంతా ఆరోగ్యంగా తిరిగి వచ్చినా ఆశ్రమంలో పరిస్థితులు మాత్రం రోగాలకు కొలువుగా మారింది.

మురుగు నీటిలోనే..

ఆశ్రమంతో పాటు ఆశ్రమం ఎదుట వసతి గృహం నుంచి వచ్చే వ్యర్థ నీరు, వర్షపు నీరు పేరుకుపోవడంతో దోమలు, దుర్వాసనతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఆ మురుగు నీటి వద్దే విద్యార్థులు ఆడుతుండడంతో విద్యార్థుల్లో కొందరు రోగాల బారినపడే అవకాశం ఉంది. విద్యార్థులు స్నానాలు చేసే ప్రాంతంలో కూడా చెత్త పేరుకుపోయింది. అయితే ఇటీవల జిల్లా వైద్యారోగ్యశాఖాధికారిణి బి.మీనాక్షి ఆశ్రమం పరిశీలించేందుకు వెళ్లే సమయంలో కూడా ఇదే దుస్థితి నెలకొనడంతో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్‌తో ఆశ్రమం పరిసరాలతో పాటు చుట్టుపక్కల పారిశుధ్య పనులు చేపట్టారు. అయినప్పటికీ అక్కడ పరిస్థితుల్లో మార్పు రాకపోవడం కొసమెరుపు. ఇదిలా ఉండగా వసతి గృహంలో వార్డెన్ పర్యవేక్షణ లోపంతో విద్యార్థులు తమకు నచ్చినప్పుడు బయటకి వెళ్లి వచ్చే పరిస్థితి ఏర్పడింది.

ఎంతో మంది అధికారులను చూసా..

ఆశ్రమంలో నెలకొన్న పరిస్థితులపై వార్డెన్ హరిప్రసాద్‌ను వివరణ కోరగా.. ఇలాగే ఉంటుందని, తాను ఎంతో మంది ఉన్నతాధికారులను చూసానంటూ చెప్పడం విశేషం. విద్యార్థులు టాయిట్లను శుభ్రంగా వినియోగించినప్పటికీ ఆశ్రమంలో వంట పనిచేసే ఓ వ్యక్తి.. వార్డెన్, విద్యార్థులు చూస్తుండగానే టాయిలెట్ల బయట నుంచి మూత్ర విసర్జన చేయడం ఆశ్రమంలో పరిస్థితులకు అద్దం పడుతుంది. ఈ విషయమై ఆ వ్యక్తిని ప్రశ్నిస్తే విద్యార్థుల్లో మహిళలు లేరని చెప్పడం కొసమెరుపు. ఇలా ఎన్నో సమస్యల నడుమ గిరిజన సంక్షేమ ఆశ్రమంలో విద్యార్థులు రోజులు గడిపేస్తున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు నిర్వహణపై దృష్టి సారించకపోవడంతో ఆశ్రమంలో ఆరోగ్యకరమైన వాతావరణం దూరమవుతోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వసతి గృహాల పర్యవేక్షణ కొరవడగా ప్రభుత్వం మారడంతో ఇప్పుడైన ఆశ్రమాల నిర్వహణపై అధికారులు దృష్టి సారిస్తారని అటు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుకుంటున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్


పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

కలెక్టరేట్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించి సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. శుక్రవారం డ్రైడే సందర్భంగా ఆయన కలెక్టర్ బంగ్లారోడ్డు తదితర ప్రాంతాల్లో పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమలను నివారించవచ్చని, దీని ద్వారా ఆరోగ్యం సాధ్యపడుతుందన్నారు. ప్రజలకు దీనిపై అవగాహన కల్పించాలన్నారు. శుక్రవారం జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో డ్రైడేగా పాటిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, డాక్టర్ వెంకటరావు, ఏసీపీ రమణమూర్తి, వైద్యారోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నిధుల పంపిణీ శాస్త్రీయంగా జరగాలి



మాట్లాడుతున్న ఆర్థిక సంఘం కార్యదర్శి రమణారెడ్డి

కలెక్టరేట్: స్థానిక సంస్థలకు నిధుల కేటాయింపు శాస్త్రీయంగా జరగాలని ఐదో రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్య కార్యదర్శి కేవీ రమణారెడ్డి అన్నారు. జడ్పీ సమావేశ మందిరంలో ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఈవో పీఆర్డీలతో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన కమిషన్ సభ్యులైన ఎం.ప్రసాదరావు, ఎన్.పద్మారావు, కె.కృపారావులతో కలిసి పాల్గొని మాట్లాడారు. నిబంధనలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలని కోరారు. అప్పుడే స్థానిక సంస్థలకు న్యాయబద్ధంగా, సమానంగా నిధుల పంపిణీ సాధ్యపడుతుందన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో వెంకటేశ్వరరావు, డీపీవో వెంకటేశ్వర్లు, డిప్యూటీ సీఈవో ఆర్.వెంకట్రామన్, జిల్లాలోని అన్ని డివిజనల్ పంచాయతీ అధికారులు, ఎంపీడీవోలు హాజరయ్యారు.

అక్రమాలపై విచారణ చేపట్టండి


విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

కంచిలి: స్థానిక పీఏసీఎస్‌లో గతేడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు పంపిణీ చేయాల్సిన 20టన్నుల యూరియా మాయం కావడంపై విచారణ జరిపి దోషులను శిక్షించాలని మండల టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మాదిన రామారావు, బంగారు కురయ్య, తమరాల శోభన్, పైల పురుషోత్తం రెడ్డి, పిలక చినబాబు విలేఖరులతో మాట్లాడారు. గత వైసీపీ పాలనలో రైతులకే కాకుండా అన్నివర్గాల ప్రజలకు అన్యాయం జరిగిందన్నారు. 20టన్నుల యూరియాను పక్కదారి పట్టించి ప్రజల సొమ్ముదోచుకున్న వారిపై కేసులు నమోదు చేయడమేకాకుండా తాత్సారం చేస్తున్న అధికారులను బాధ్యులను చేయాలన్నారు. సమావేశంలో నాయకులు టీవీ రమణ, మద్దిల ఆనంద్, భాస్కర్, పైల సూర్యనారాయణ రెడ్డి, పూర్ణ, సనపల కామేష్, పైల రామారావు, జి.మన్మధరావు, వాసాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలను అరికట్టాలి



మానవహారంగా నిల్చొన్న విద్యార్థులు, సంఘ నాయకులు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం కేంద్రంగా సరఫరా అవుతున్న గుట్కా, ఖైనీ తదితర మత్తు పదార్థాలను పూర్తిగా అరికట్టాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.యుగంధర్ డిమాండ్ చేశారు. మత్తు పదార్థాలు అరికట్టడంలో భాగంగా ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాత బస్టాండ్ జంక్షన్‌లో మానవహారం చేపట్టారు. ఇచ్ఛాపురం కేంద్రంగా ఒడిశా సరిహద్దుల ద్వారా మత్తు పదార్థాల రవాణా జోరు గా సాగుతుందన్నారు. వీటిని అరికట్టడంలో ప్రభుత్వ అధికారులు, పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శులు గోరు వాసు, కె.శ్రీనివాసరావు, నాయకులు సిద్ధార్థ, రామ్‌కుమార్, కిషోర్, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్లపై పశువులు విడిచిపెడితే చర్యలు

శ్రీకాకుళం క్రైం: రోడ్లపై పశువులు విడిచిపెట్టడం వల్ల అపరిశుభ్రంగా తయారవడంతోపాటు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. వీటిని గుర్తించిన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పందించి నివారణ చర్యలకు ఆదేశించారు. దీంతో రోడ్లపై ఆవులు, గేదెలు తదితర పశువులను విడిచిపెడితే వాటిని పెంచే యాజమానులపై చర్యలు తప్పవని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసుకు హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన నగరంలోని పలు ప్రాంతాలను పరిశీలించారు. పశువులు పెంచే వారు వారి ఇంటి వద్ద ఉన్న ఖాళీ స్థలంలో వాటిని కట్టి ఉంచాలని, లేని పక్షంలో ఆవులు, పశులవులను సీతంపేట అడవులకు తరలిస్తామని కమిషనర్ స్పష్టం చేశారు.

రాయితీపై కందిపప్పు, బియ్యం


బియ్యం, కందిపప్పు అందిస్తున్న ఎమ్మెల్యే అశోక్

ఇచ్ఛాపురం: రాయితీపై అందిస్తున్న కందిపప్పు, బియ్యాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. శుక్రవారం మున్సిపల్ డైలీ మార్కెట్ ఎదురుగా మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో రాయితీపై కందిపప్పు, బియ్యం, పంపిణీ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు నిత్యావసర సరుకులు అందుబాటులో ఉండేందుకే ప్రభుత్వం రేషన్ కార్డుదారులకు ఈ అవకాశాన్ని కల్పించిందన్నారు. కేజీ కందిపప్పు మార్కెట్ లో రూ.180 ఉంటే ప్రభుత్వం రూ160లకు అందిస్తుందన్నారు. సోనా మసూర్ 26 కేజీల బియ్యం బస్తా మార్కెట్‌లో రూ.1452 కాగా.. ప్రభుత్వం రాయితీపై రూ.1274లకే అందిస్తుందన్నారు. ఒక్కో లబ్ధిదారునికి ఒక బస్తా బియ్యం, కేజీ కందిపప్పు మాత్రమే అందిస్తున్నట్టు తెలిపారు. ఈ పంపిణీ కేంద్రాన్ని స్థానిక హోల్ సేల్ డీలర్స్ అసోసియేషన్ సభ్యులు నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం సూపర్ బజార్ జంక్షన్ వద్ద ఉన్న ఎర్రన్నాయుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ ఇన్‌చార్జి దాసరి రాజు, తహసీల్దార్ ఎంబీ అప్పారావు, డీటీ శ్రీహరి, సీహెచ్‌డీటీ సంతోష్‌కుమార్, కూటమి నాయకులు కాళ్ల ధర్మారావు, కాళ్ల దిలీప్, పత్రి తవిటయ్య తదితరులు పాల్గొన్నారు.

మంత్రి దృష్టికి సమస్యలు

ఇచ్ఛాపురం: మంత్రి కింజరాపు అచ్చన్నాయుడును టీడీపీ పట్టణ కార్యదర్శి నందికి జాని మర్యాద పూర్వకంగా విజయవాడలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపాల్టీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు వివరించారు. బాహుదా నదిపై గల వంతెన ఏడాది కిందట కూలిపోయిందని, నేటికీ వంతెన నిర్మించపోవడంతో వాహనదారులు పడుతున్నారన్నారు. రోడ్డు మరమ్మతులు చేపట్టాలని, పాత వంతెన పక్కన నూతన వంతెన నిర్మాణం చేపడతామని ఎన్నికల సమయంలో వైసీపీ నాయకులు నిధులు కేటాయించామని బూటకపు మాటలు చెప్పి ప్రజలను మోసం చేశారు. నూతన వంతెన నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. గౌరి దుర్గాజీ తదితరులు ఉన్నారు.

అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్లు

బూర్జ: అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వానికి రెండు కళ్లు వంటివని మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్ అన్నారు. రాజుపేటలోని తన స్వగృహంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా ముఖ్యమంత్రి చంద్రబాబు నెరవేరుస్తున్నారన్నారు. 16,347టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్, వృద్ధాప్య వితంతు పింఛన్లు పెంపు, దివ్యాంగుల పింఛన్ రెట్టింపు చేశారని గుర్తుచేశారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు చేసిందని, ఉచిత ఇసుక అమలు చేపట్టారన్నారు. తల్లికి వందనం మార్గదర్శకాలు ఇప్పటికే విడుదల చేశారన్నారు. వైసీపీ పాలనలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు నెలవారి వేతనాలు సమయానికి అందేవి కాదని, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒకటో తేదీనే జీతాలు అందించారన్నారు.

రీసెర్చ్ సెట్‌పై సమీక్ష

ఎచ్చెర్ల: రాష్ట్రంలోని వివిధ వర్సిటీల్లోని పీహెచ్‌డీ సీట్ల భర్తీకి ఈ ఏడాది మే మొదటి వారంలో శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ (తిరుపతి) ఆర్‌సెట్-2024 నిర్వహించింది. దీనిపై శుక్రవారం రాష్ట్ర ఉన్నత విద్యా మండలి నిర్వహించిన వర్చువల్ విధానంలో నిర్వహించిన సమీక్షలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ కేఆర్ రజని పాల్గొన్నారు. అంబేడ్కర్ వర్సిటీలో ఆరు కోర్సుల్లో పీహెచ్‌డీ అవకాశం ఉంది. గత నెల 24 నుంచి ఐదు రోజుల పాటు వివిధ వర్సిటీల్లో సీట్ల కేటాయింపునకు కౌన్సెలింగ్ జరిగింది. దీనికి సంబంధించి గైడ్లు కేటాయించేందుకు సమీక్షలో చర్చించారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఇన్‌చార్జి చైర్మన్ కె.రామ్మోహనరావు, ఆర్‌సెట్ కన్వీనర్ బి.దేవ ప్రసాదరాజు ఉన్నారు.

సాయిరామ్‌కు అభినందన

అరసవల్లి: రిమ్స్ పరిపాలన విభాగం సూపరింటెండెంట్‌గా పదోన్నతి పొందిన ఉద్యోగ సంఘాల జేఏసీ జిల్లా ఛైర్మన్, ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరామ్‌కు పలువురు అభినందనలు తెలిపారు. వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు బి.సుధాకర్, బీవీ మనోహర రావు, బడగల పూర్ణచంద్రరావు, పీసీ నందా, ఎ.మురళీ కృష్ణ, పి.బాలరాజు, శేఖర్‌బాబు, బి.గోవింద్, పి.అప్పలనాయుడు, జోగారావు, పి.గణపతిరావు తదితరులు ఉన్నారు.

25 నుంచి సీసీ టీవీ ఇన్‌స్టాలేషన్‌పై శిక్షణ

ఎచ్చెర్ల: ఎచ్చెర్లలోని యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థలో ఈ నెల 25వ తేదీ నుంచి సీసీ టీవీ ఇన్‌స్టాలేషన్, సర్వీసెస్‌పై శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్టు డైరెక్టర్ కె.శ్రీనివాసరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై 19-45 ఏళ్ల లోపు గల పురుష అభ్యర్థులు ఈ కోర్సులో చేరేందుకు అర్హులని చెప్పారు. 13 రోజుల పాటు నిర్వహించే ఈ శిక్షణలో ఉచిత భోజన, వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. అదనపు సమాచారం కోసం 95534 10809, 79933 40407 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలన్నారు.

కవులకు ఆదర్శం.. కవిత్రయం

శ్రీకాకుళం కల్చరల్: తెలుగు భాషా సాహిత్యం కవులందరికి నన్నయ, తిక్కన, ఎఱ్ఱన (కవిత్రయం) ఆదరర్శంగా నిలుస్తారని అవధాని బులుసు అపర్ణ అన్నారు. సుమిత్రా కళా సమితి ఆధ్వర్యంలో వైజయంతి కళావేదికలో ద్విశతావధాన కార్యక్రమం మూడో రోజు శుక్రవారం కూడా కొనసాగింది. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ నుంచి వచ్చిన అవధాని దత్తాత్రేయ శర్మ మాట్లాడుతూ.. అవధాన ప్రక్రియ అనేది పద్య సాహిత్యంతో కూడుకొని ఉంటుందని, కొప్పరపు కవులు ఈ అవధాన పాండిత్యాని ఆద్యులన్నారు. కార్యక్రమంలో ఇప్పిలి శంకర్ శర్మ, పులఖండం శ్రీనివాసరావు, కొమ్మనా సురేష్, మండవల్లి రవి, గుత్తు చిన్నారావు, వీవీఆర్ మూర్తి, నక్క శంకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

వంశధార కాలువలో పూడికతీత

సరుబుజ్జిలి: ఖరీఫ్ రైతులకు సాగునీరు అందించడానికి ఎటువంటి ఇబ్బంది లేకుండా వంశధార కుడి ప్రధాన కాలువలో పూడికతీతలు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆదేశాలతో వంశధార అధికారులు కాలువలో పేరుకుపోయిన గుర్రపు డెక్క తొలగిస్తున్నారు. దీనితో ఆయా ప్రాంతాల్లోని టీడీపీ నాయకులు గత రెండు రోజులుగా యంత్రాలతో పనులు చేయిస్తున్నారు. సరుబుజ్జిలి గ్రామ పంచాయతీ సమీపంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎండ రామారావు ఆధ్వర్యంలో కాలువలో పూడికతీత పనులు చేపట్టారు.

శంకర్‌ను అభినందించిన చంద్రబాబు


చంద్రబాబుతో ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు. శుక్రవారం రాత్రి అమరావతిలో ముఖ్యమంత్రిని మర్యాద పూర్వకంగా శంకర్ కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలోనే రికార్డు స్థాయి మెజార్టీతో గెలుపొందడంపై అభినందించారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని బాధ్యతగా తీసుకుని నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని, ప్రభుత్వం అన్ని విధాల సహకరిస్తుందని సీఎం భరోసా ఇచ్చారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే స్వచ్ఛందంగా చేపడుతున్న అన్న క్యాంటీన్, ఇతరత్రా కార్యక్రమాల గురించి సీఎం అడిగి తెలుసుకున్నారు.

నేడు విద్యుత్ కోత

అరసవల్లి: ఉమ్మడి జిల్లాలోని టెక్కలి, పలాస, శ్రీకాకుళం, పాలకొండ డివిజన్లలో 28 విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం మరమ్మతులు చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్తు నిలిపివేయనున్నట్టు ఈపీడీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ (శ్రీకాకుళం) నాగిరెడ్డి కృష్ణమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లక్ష్మీనర్సుపేట, గంగువాడ, పోలాకి, గొప్పిలి, నౌపడ, టెక్కలి, మధనాపురం, నిమ్మాడ, చల్లవానిపేట, నౌతల, కాశీబుగ్గ, పలాస, పూండి, హరిపురం, సోంపేట, బొరివంక, కంచిలి, ఇచ్ఛాపురం, పార్వతీశంపేట, తొగరాం, ఆలికాం, కళింగపట్నం, ఏఎస్‌ఎన్ కాలనీ, ఆదపాక, లుంబూరు, సీతంపేట, భామిని ఉపకేంద్రాల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్తు కోత ఉంటుందని వివరించారు.

కళింగపట్నం సబ్‌స్టేషన్ పరిధిలో..

గార: కళింగపట్నం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు నేపథ్యంలో శనివారం ఉదయం 9 గంటలు నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఆ శాఖ ఈఈ బయ్యన్నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో ఈ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సోంపేట సబ్‌స్టేషన్ పరిధిలో..

సోంపేట: సోంపేట సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల చేపట్టనుండడంతో శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ జి.ప్రసాద్ తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని సోంపేట, జింకిభద్ర, బెంకిలి, పలాసపురం, లక్కవరం, ఇస్కలపాలేం, రుషికుద్ద, రామయ్యపట్నం తదితర గ్రామాల్లో విద్యుత్ నిలిపివేస్తామన్నారు.

బొడ్డేపల్లిపేట సబ్‌స్టేషన్ పరిధిలో..

ఆమదాలవలస: పట్టణ పరిధిలోని బొడ్డేపల్లిపేట సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సత్తారు బయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. వెంకయ్యపేట, లక్ష్ముడుపేట, జగ్గుశాస్త్రులపేట, పార్వతీశంపేట, బొడ్డేపల్లిపేట, పూజారిపేట, ఐజే నాయుడు కాలనీ, కృష్ణాపురం, మోనింగివారివీధి, ప్రభుత్వ జూనియర్ కళాశాల, లక్ష్మీనగర్‌లో కొంత భాగం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు. ఈ అసౌకర్యాన్ని ప్రజలందరూ గమనించి విద్యుత్‌శాఖ సిబ్బందికి సహకరించాలని ఆ ప్రకటనలో కోరారు.

పీజీ, ఎంసీఏ సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్సిటీ, అనుబంధ కళాశాలల్లో చదువుతున్న పీజీ మొదటి, ఎంసీఏ నాలుగో సెమిస్టర్ ఫలితాలను శుక్రవారం విడుదల చేశారు. పీజీలోని మొత్తం 19 కోర్సులకు 442 మంది పరీక్షలకు హాజరుకాగా ఇందులో 311 మంది ఉత్తీర్ణులయ్యారు. ఎంసీఏ నాలుగో సెమిస్టర్‌కు 37 మంది పరీక్షలు రాయగా శతశాతం ఉత్తీర్ణులయ్యారు. ఫలితాల వివరాలను వర్సిటీ వెబ్‌సైట్, మనబడి పోర్టల్‌లో అందుబాటులో ఉంచామని డీన్ డాక్టర్ ఎస్.ఉదయభాస్కర్ తెలిపారు.

రాయితీపై నిత్యావసర సరుకులు

సోంపేట: రాయితీపై నిత్యావసర సరుకులు అమ్మకాలు చేపట్టాలని తహసీల్దార్ విజయ్‌కుమార్ అన్నారు. సోంపేట పట్టణంలోని కిరాణా దుకాణాల్లో రూ.160లకే కిలో కందిపప్పు, రూ.45లకే సన్నబియ్యం అమ్మకాలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం నిరుపేదలకు నిత్యవసర సరుకులు అందుబాటులో తెచ్చేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. మాజీ ఎంపీపీ చిత్రాడ శ్రీనివాసరావు, సానా షన్ముఖరావు, చిత్రాడ శేఖర్, బీన ఆనంద్, ఈశ్వరరావు,దూసి మధు, మడ్డు రాజారావు పాల్గొన్నారు.